నిబంధనలు పాటించాలి

బండ్లగూడ : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ సూచించారు. బుధవారం ఉప్పర్‌పల్లి పిల్లర్ నం.158 వద్ద సర్వీస్ రోడ్లపై అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన లారీ యజమానులకు ఆయన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ గౌడ్‌తో కలిసి అవగాహన కల్పించారు. ఏసీపీ మాట్లాడుతూ.. లారీలను ఎక్కడ పడితే అక్కడ నిలిపి వాహనదారులకు ఇబ్బందులు కల్గించవద్దని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాని వారికి చలాన్లను విధించడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని వారికి తెలిపారు. ఇతరులకు సమస్యగా మారకుండా చూడవలసిన బాధ్యత వాహనదారులు, యజమానులదే అన్నారు.

పటాకుల దుకాణాలకు లైసెన్స్ తీసుకోవాలి

హిమాయత్‌నగర్ : దీపావళి సందర్భంగా తాత్కలిక పటాకుల దుకాణాల యజమానులు లైసెన్స్ తీసుకోవాలని జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ -16 ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవాసాలకు దూరంగా, పెద్ద హాల్స్, విశాలమైన స్థలంలో దుకాణాలను ఏర్పాటు చేసుకుని, ఫైర్ సేఫ్టీ ఉండేలా చూసుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా పటాకుల దుకాణాలను ఏర్పాటు చేసి, విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళా శక్తి పథకం ద్వారా రుణాలు

మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రుణాలు ఇస్తున్నామని యూసీడీ డీపీఓ వెంకట కిషన్‌రావు పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ కో - ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్‌ను సందర్శించి మేనేజర్‌తో భేటీ అయ్యారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 180 యూనిట్ల లక్ష్యంగా బ్యాంకర్లతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. పొదుపు గ్రూపుల్లో మహిళలకు వ్యక్తిగత రుణ సదుపాయాలు కల్పిస్తున్న ట్లు తెలిపారు. స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లో స్థిరపడనున్నట్లు తెలిపారు.

- జూబ్లీహిల్స్

సమస్యలకు నిలయాలు..అంగన్‌వాడీ కేంద్రాలు

74 భవనాలకు 8 నెలలుగా చెల్లించని అద్దెలు

ఆయాలు లేకుండా ఒక్క టీచర్‌తో 17 కేంద్రాలు

రహ్మత్‌నగర్ డివిజన్‌లో నీటి సౌకర్యం లేకుండా కొనసాగుతున్న హనుమాన్ స్టోన్ కట్టర్స్ అంగన్‌వాడీ సెంటర్

జూబ్లీహిల్స్, అక్టోబర్ 23 : అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలకు నిలయాలుగా మారిపోతున్నాయి. సొంత భవనం లేని కేంద్రాలకు 8 నెలలుగా అద్దె చెల్లించడంలేదని భవన యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనం ఉన్న కొన్ని కేంద్రాల్లో నీటి కొరత వంటి సమస్యలు ఉన్నాయి. ఇటీవల పదోతరగతి పాసైన ఆయాలకు టీచర్లుగా పదోన్నతి ఇవ్వడంతో ఆయా కేంద్రాల్లో సిబ్బంది కొరత ఏర్పడింది. కొన్నేండ్లుగా పెయింటింగ్, పిల్లలను ఆకట్టుకునే బొమ్మలు వేయకపోవడంతో అపరిశుభ్రంగా మారిపోతున్నాయి. వంటా వార్పు పెట్టడంతో ఒత్తిడి పెరిగి ఆయాలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కొందరు సహాయకులు పనులు మానేశారు. ఖైరతాబాద్ ప్రాజెక్ట్‌లో ఆయాలు లేకుండా పలు కేంద్రాలు కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ టీచర్లు 8 నెలలుగా తమ చేతినుంచే అద్దె చెల్లిస్తున్నారు.

కూరగాయలు తేవడం వంటచేయడం అదనపు భారం..

కూరగాయలు తేవడం, వంటచేసి పెట్టడంతో పిల్లల చదువుపై శ్రద్ధ చూపలేకపోతున్నారు. టీచర్లు తమకొచ్చే అతికొద్ది జీతంలో ఆయాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. అద్దెలు చెల్లించుకుంటూ..కుటుంబ పోషణకు అప్పుల పాలు అవుతున్నారు. ఒక్కరే ఉన్నచోట ఆరోగ్యం సహకరించకున్నా.. వదిలివెళ్లలేని పరిస్థితి నెలకొన్నది.

పిల్లలకు ప్రతినెల చేపట్టే గ్రోత్ మానిటరింగ్‌లో ఎదుగుదల లేని పిల్లలను వైద్య పరీక్షల కోసం దవాఖానలకు తరలించేందుకు సైతం అంగన్‌వాడీ టీచర్లు వారి చేతి నుంచే ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పోషకాహారం పేరుతో ఇచ్చే ఆహారంలో తరచుగా పాడైపోయిన కోడిగుడ్లు సరఫరా అవుతున్నాయి. యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్ డివిజన్లలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీహెచ్ఆర్ (టేక్ హోమ్ రేషన్) కింద ఇంటికి తీసుకెళ్లిన కోడిగుడ్లు పాడైపోయి ఉన్నాయని ఇటీవల తల్లిదండ్రులు, గర్భిణీలు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

అద్దె చెల్లింపులు అధికారులు చూస్తారు

- పుష్ప, సీడీపీఓ, ఖైరతాబాద్ ప్రాజెక్ట్

ఖైరతాబాద్ ప్రాజెక్ట్‌లో 74 అద్దె భవనాలున్నాయి. అద్దె భవనాలకు చెల్లింపులు జిల్లా సంక్షేమ అధికారులు చూస్తారు. ఆయాలు లేకుండా 17 కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఆయాల నియామకం కూడా ప్రభుత్వ పరిధిలో ఉంటుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

అందుబాటులో ఉంటా..

బీఆర్ఎస్ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు యాదిరెడ్డి నూతన గృహప్రవేశానికి యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమం లో మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేశ్, మైసిరెడ్డి, అరుణ్‌ముదిరాజ్, రాఘవేందర్‌యాదవ్, వెంకటరమణ, మహేశ్‌గౌడ్, ఎల్.రాజు, అంజి, శ్రీకాంత్‌రెడ్డి, కార్తీక్, అశోక్‌కుమార్, క్రాంతి, భాస్కర్, రాజు, ధనుంజయ్ పాల్గొన్నారు.

- మైలార్‌దేవ్‌పల్లి

రోడ్లకు ప్యాచ్‌వర్క్ పనులు

సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అప్పారెడ్డి ముఖేశ్ అన్నారు. బుధవారం గుంతలమయంగా మారిన రోడ్లకు ప్యాచ్‌వర్క్ పనులను ముఖేశ్ పరిశీలించి చేయించారు. పిల్లర్ నం.122 నుంచి అత్తాపూర్‌లోకి వెళ్లే ప్రధాన రహదారి ఇబ్బందికరంగా మారిందన్నారు. సమస్యను రాజేంద్రనగర్ డీసీ రవికుమార్ దృష్టికి తీసుకెళ్లగా.. ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఈఈ నరేందర్‌గౌడ్, ఏఈలకు ఆదేశాలు జారీ చేశారన్నారు. దాంతో ఉదయం తాత్కలికంగా ప్యాచ్‌వర్క్ పనులు చేశారని తెలిపారు.

- మైలార్‌దేవ్‌పల్లి

గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న వంశీ ప్రసాద్

ఖైరతాబాద్, అక్టోబర్ 23 : రాష్ట్రంలో గుర్తింపు లేని విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆలైడ్ హెల్త్ కేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వంశీ ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పలు హెల్త్ సైన్సెస్ విద్యా సంస్థల యాజమాన్యాలు అనుమతులు, గుర్తింపు లేకున్నా విద్యార్థులను చేర్చుకొని వారి జీవితాలతో చెలగాటమాడుతున్నాయన్నారు. ఇప్పటికే హైదరాబాద్ వ్యాప్తంగా పది విద్యాసంస్థలను గుర్తించామని, అలాంటి వాటితో విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వంవిచారణ జరిపించి ఆయా విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాములు, దేవ దీపిక పాల్గొన్నారు.

అంధకారంలో వెంగళరావునగర్ కాలనీ

వెంగళరావునగర్ కాలనీలో అంధకారం అలుముకున్నది. స్ట్రీట్‌లైట్లు వెలుగడం లేదు. వెంగళరావునగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాల పక్క లైన్, చర్చి గల్లీ, బ్రహ్మాంటాలెంట్ స్కూల్ రోడ్డు, అయ్యప్ప గ్రౌండ్ వెనుక లైన్, సిద్ధార్థ నగర్ పార్క్ లైన్ ప్రాంతాల్లో వీధి దీపాలు వెలుగడం లేదు. బల్దియా నిర్వహణ లోపం వాహనదారుల పాలిట శాపంగా మారింది. దాంతో ఈ ప్రాంతాలు దొంగలు, అసాంఘిక కార్యకలాపాలకు అనువుగా మారింది. చీకట్లో పాదచారులు రోడ్లపై నడిచి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

- వెంగళరావు నగర్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున స్వదేశ్, కుమారస్వామి, డాక్టర్ వినయ్

నేటి నుంచి హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో.. ఫార్మా ఇండియా ఎక్స్‌పో

ఖైరతాబాద్, అక్టోబర్ 23 : హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నేటి నుంచి 26వ తేదీ వరకు ఫార్మా ఇండియా ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు ఇండియన్ ఎగ్జిబిషన్ సర్వీసెస్ సీఈవో స్వదేశి కుమార్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఎక్స్‌పోకు సంబంధించిన పోస్టర్లను జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, శాస్త్రవేత్త దుండ్ర కుమారస్వామి, జెనిసిస్ ఇన్ఫార్మేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో డాక్టర్ వినయ్, క్లినిసాల్ సంస్థ సీఈవో సీఎస్ ముజీబుద్దీన్, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, ఎన్.కె. శేగల్‌తో కలిసి ఆవిష్కరించారు. కొవిడ్ -19 సమయంలో దేశ, విదేశాలకు భారతీయ ఫార్మా కంపెనీలు టీకాలు సరఫరా చేసిందని, అమెరికా, యూకే దేశాల్లో అవసరమైన మందులను ఇక్కడి నుంచే సరఫరా చేస్తోందని తెలిపారు. ఎలాంటి విపత్తు వచ్చినా భారతదేశం ప్రపంచానికి అండగా నిలబడుతుందన్నారు. ఈ ఎక్స్‌పో ఫార్మా రంగంలో వస్తున్న ఆధునిక పోకడలు, కొత్త ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తుందన్నారు.

పేద విద్యార్థులకు చేయూత కోసం 'ది పర్పుల్ పాప్ అప్' ఎగ్జిబిషన్'

బంజారాహిల్స్, అక్టోబర్ 23 : పేద విద్యార్థులకు చేయూత అందించేందుకు నిధుల సమీకరణలో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నం.10లోని జామూన్ స్పేస్‌లో బుధవారం 'ది పర్పుల్ పాప్ అప్' పేరుతో డిజైనర్ అండ్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. దేశంలోని ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాలు, లైఫ్‌స్టైల్ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో ఢిల్లీ, కోల్‌కతా, జైపూర్ నగరాలను నుంచి ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకువచ్చారని నిర్వాహకురాలు సుచరితా రెడ్డి, శ్రీజ తెలిపారు. తమ ప్రదర్శన నుంచి వచ్చే ఆదాయాన్ని పేద విద్యార్థుల కోసం వినియోగిస్తామని పేర్కొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం

కులమతాలకు అతీతంగా పేద విద్యార్థులను సహాయ సహకారాలు అందిస్తున్నామని మణికొండ రెడ్డి ఫౌండేషన్ సభ్యులు శ్రీపతిరెడ్డి, రామసుబారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. పంచవటి కాలనీ వాసులు బాలనాగయ్య, శాంతమ్మల కుమారుడు వందనం సంతోష్‌కు 10వ తరగతి చదువుకునేందుకు రూ.25 వేలు అందజేశారు. ల్యాంకోహిల్స్, ఎస్ఆర్ డి.జి. స్కూల్‌లో మొత్తం ఫీజును వారు చెల్లించారు. కార్యక్రమంలో నాయకులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

- మణికొండ

మూసీ బాధితులకు అండగా ఉంటాం

బండ్లగూడ, అక్టోబర్ 23 : మూసీ బాధితులకు అండగా ఉంటామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన మూసీ బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం సుందరీకరణ పేరుతో ప్రకృతిని నాశనం చేసే దిశగా సాగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో మూసీ బాధితులకు అండగా ఉండేందుకు నిర్వహించనున్న ధర్నాలో అందరూ పాల్గొలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు భీమార్జున్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వై.శ్రీధర్, మోండ్ర కొమురయ్య, వేణుగోపాల్‌రెడ్డి, గోకుల్ మహేశ్‌యాదవ్, పి.మల్లేశ్‌యాదవ్, పి.మల్లారెడ్డి, బండా నరేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

రూ.35 కోట్లతో..అభివృద్ధి పనులు

అధికారులతో చర్చిస్తున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, అక్టోబర్ 23 : ఖైరతాబాద్ నియోజకవర్గంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనుల కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.35 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. బుధవారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో జీహెచ్ఎంసీ, జలమండలికి చెందిన అన్ని డివిజన్ల అధికారులు, ప్రజాప్రతినిధులు, బస్తీ నాయకులతో ఎమ్మెల్యే దానం నాగేందర్ సమావేశం నిర్వహించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, హిమాయత్‌నగర్, ఖైరతాబాద్, సోమాజిగూడ డివిజన్ల పరిధిలో చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. సీవరేజ్, తాగునీరు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయిన విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో నిధులు మంజూరు చేయించారన్నారు.

ఇప్పటికే అన్ని పనులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించడం జరిగిందని, పేదలు నివాసం ఉంటున్న బస్తీల్లో తొలిదశలో పనులు పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో జలమండలి జీఎం హరిశంకర్, వాటర్‌వర్క్స్ మేనేజర్లు రాంబాబు, జీహెచ్ఎంసీ ఈఈ విజయ్‌కుమార్, కార్పొరేటర్ వనం సంగీతయాదవ్, వివిధ డివిజన్ల నాయకులు మామిడి నర్సింగరావు, భారతీనాయక్, రాములు చౌహాన్, జావెద్, ఆకుల రాజు, నల్ల శివ పాల్గొన్నారు.

ఎంబీఏ పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఓయూ పరిధిలోని ఎంబీఏ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పరుగు పందెంలో గోల్కొండ-1 విద్యార్థికి సిల్వర్ మెడల్

మెహిదీపట్నం, అక్టోబర్ 23 : కేంద్రీయ విద్యాలయాల జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో రన్నింగ్ పోటీల్లో కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్‌లోని కేంద్రీయ విద్యాలయ-1 విద్యార్థి రాజ్‌వీర్ గుర్జార్ సిల్వర్ మెడల్ గెలుచుకున్నాడు. తిరువనంతపురంలో జరిగిన కేంద్రీయ విద్యాలయాల 53వ క్రీడా పోటీల్లో 800 మీటర్ల విభాగంలో రాజ్‌వీర్ గుర్జార్ సిల్వర్ మెడల్ సాధించాడు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ విద్యార్థిని ప్రిన్సిపాల్ సురేశ్ కటోచ్ అభినందించారు.

సమస్యలు పరిష్కరిస్తాం..

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 23 : ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టి.ప్రేమ్‌గౌడ్ అన్నారు. రాజీవ్ గృహకల్ప ఫేస్-1లో నీటిసంపులో కరెంట్ మోటర్ షార్ట్ సర్క్యూట్ కారణంతో కాలిపోయింది. దీంతో స్థానికుల ఇబ్బందులను తెలుసుకునేందుకు ఆయన బుధవారం నాయకులతో కలిసి పర్యటించారు. నాలుగు రోజులుగా నీళ్లు లేక అవస్థలు పడుతున్నామని వారు తెలుపగా..మోటర్‌ను బాగు చేయిస్తానని హామీ ఇచ్చారు. వెంటనే ట్యాంకర్లను తెప్పించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 23 : బాధిత కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసినట్లు సుల్తాన్‌పల్లి మాజీ సర్పంచ్ దండు ఇస్తారి తెలిపారు. బుధవారం సుల్తాన్‌పల్లికి చెందిన నీరటి కుమార్ రూ.52,200, ఎల్గని రాణి రూ. 21 వేల చెక్కులను ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సహకారంతో అందించిన్నట్లు వివరించారు. ప్రభాకర్‌గౌడ్, బల్వంత్‌రెడ్డి, రాజుగౌడ్, వెంకటేశ్ గౌడ్, సిద్దయ్యగౌడ్,ప్రశాంత్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా..

మెహిదీపట్నం : గోల్కొండలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ సంబంధిత ట్రాఫిక్ పోలీస్ అధికారులకు సూచించారు. బుధవారం గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి ఎమ్మెల్యేను కలిసి ట్రాఫిక్ సమస్యలపై చర్చించారు.

కాచిగూడ : ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలని ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అద్దాల బ్లాక్ స్టిక్కర్లను తొలగించారు.

బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఓయూ పరిధిలోని బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఈ కోర్సు రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. మెమోలను మూడువారాల తర్వాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి 28వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 30వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ లాంగ్వేజెస్, మూడేళ్ల ఎల్ఎల్బీ, మూడేళ్ల ఎల్ఎల్బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్బీ తదితర కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్/సీనియర్ డిప్లొమా ఇన్ ఫ్రెంచ్/జర్మన్ పరీక్షలను వచ్చే నెల 5వ తేదీ నుంచి, బీఫార్మసీ (పీసీఐ) ఎనిమిదో సెమిస్టర్ మేకప్ పరీక్షలను 6వ తేదీ నుంచి, బీసీఏ ఆరో సెమిస్టర్ మేకప్ పరీక్షలను 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఆలోచింపచేసిన 'ప్రేరణ' నృత్య రూపకం

రవీంద్రభారతి, అక్టోబర్ 23 : వరంగల్‌కు చెందిన కళాకారులు గజ్జల రంజిత్‌కుమార్, నవ్యజల బృందం పేరిణి నాట్యాన్ని మేళవించి ప్రదర్శించిన 'ప్రేరణ' నృత్య రూపకం ఆలోచింపజేసింది. బుధవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్ తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నటరాజ కళాకృష్ణ నృత్య జ్యోతి అకాడమీ ఆధ్వర్యంలో 40 మంది కళాకారులతో ప్రేరణ నృత్య రూపకం ప్రదర్శించారు. సుమధుర సంగీతంతో కాకతీయుల కళా స్ఫూర్తితో ప్రారంభమైన నృత్య రూపకం నేటి సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలకు అద్దం పట్టింది. వరంగల్ ఎంపీ కడియం కావ్య, సంగీత నాటక అకాడమీ చైర్మన్ పుంజాల అలేఖ్య, భాషాసాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, కేంద్ర సంగీత నాటక అవార్డు గ్రహీత డాక్టర్ కళాకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని కళాకారులను అభినందించారు.

అర్చక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

సుల్తాన్‌బజార్ : దేవాదాయ శాఖలో విధులు నిర్వహిస్తున్న అర్చకులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని దేవాదాయశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాండూరి క్రిష్ణమాచారి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం తన కళా నైపుణ్యంతో గీసిన మంత్రి కొండా సురేఖ చిత్రపటాన్ని ఆయన సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో కొండా సురేఖకు అందజేసి సన్మానించారు. క్రిష్ణమాచారి మాట్లాడుతూ.. మంత్రిగా బాధ్యతలను చేపట్టిన అనతికాలంలోనే అర్చక, ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడం హర్షణీయమన్నారు. కృషి చేసిన దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే కమిషనర్, ఉన్నతాధికారులు, అర్చక, ఉద్యోగులతో సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

స్వచ్ఛ్ భారత్ చేపడుతున్నా.. షేక్‌పేటలోని కొన్ని ప్రాంతాల్లో చెత్తతొలగించడంలో విఫలం అవుతున్నారు. రోడ్డుపక్కనే చెత్త వేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. - షేక్‌పేట